క్లుప్తంగా

ఇసుక ట్రాక్టరు పట్టివేత



బొబ్బిలి రూరల్: పట్టుబడిన ఇసుక ట్రాక్టరు

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామ వేగావతి నదీతీరం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును మెట్టవలస గ్రామం వద్ద గురువారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి, పోలీస్‌స్టేషన్‌కు ట్రాక్టరును తరలించారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు శ్రీను శుక్రవారం ఉదయం స్టేషన్‌కు వెళ్లి, ట్రాక్టరు యజమానికి రూ.10 వేలు జరిమానా విధించి, వదిలేశారు. మరోసారి పట్టుబడితే రెండింతలు వసూలు చేస్తామని హెచ్చరించారు.

రామభద్రపురం: మండలంలోని పాడివానివలస జంక్షన్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ వి.ప్రసాదరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఇదే మండలంలోని పాతరేగ గ్రామానికి చెందిన గొర్లి భాస్కరరావు కోటశిర్లాం ఏడొంపుల గెడ్డ నుంచి అక్రమంగా ట్రాక్టరుతో ఇసుక తరలిస్తున్న సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడ కాపుకాసి ట్రాక్టరును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సీఎం సహాయనిధికి రూ.లక్ష విరాళం



ఎమ్మెల్యే బేబీనాయనకు రూ.లక్ష అందిస్తున్న నాయకులు

తెర్లాం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం తెర్లాం టీడీపీ నాయకులు రూ.లక్ష విరాళం ప్రకటించి, ఎమ్మెల్యే బేబీనాయన చేతులమీదుగా సీఎం సహాయనిధికి శుక్రవారం అందజేశారు. తమవంతు సాయం చేయడం చాలా ఆనందంగా ఉందని, దాతలు స్పందిస్తున్న తీరు మరువలేనిదని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోనెల రూప, ఎంపీటీసీ సభ్యుడు జి.ఆనందరావు, ఉపసర్పంచ్ మర్రాపు శంకరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్



గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

రామభద్రపురం: పౌష్టికాహారంతో రక్తహీనత సమస్యకు చెక్ పెట్టవచ్చని ఎంపీడీవో రమామణి, తహసీల్దారు సులోచనరాణి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, సూర్యకుమారి, రత్నకుమారిల ఆధ్వర్యంలో పౌష్టికాహారం, దాని ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముచ్చర్లవలస అంగన్‌వాడీ కేంద్రంలో పలువురు గర్భిణులకు సీమంతం చేశారు.

సన్మానం



జయకృష్ణను సన్మానిస్తున్న సిబ్బంది

వంగర: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు ఎస్.జయకృష్ణను సిబ్బంది, విద్యార్థులు కలిసి శుక్రవారం సన్మానించారు. అదే పాఠశాలలో ఇంగ్లిష్ బోధిస్తున్న ఆయన జిల్లా స్థాయిలో అవార్డు అందుకున్న నేపథ్యంలో సత్కరించినట్లు సిబ్బంది తెలిపారు. ఎస్‌ఆర్‌పీగా, డీఆర్‌పీగా ఆయన విశేష సేవలందిస్తూనే ఇంగ్లిష్ భాషపై ఎంతోమందికి శిక్షణ ఇచ్చారని ప్రశంసించారు.

ఈకేవైసీ తప్పనిసరి

రేగిడి: రైతులు సాగుచేస్తున్న పంటలకు సంబంధించి, ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో మురళీకృష్ణ సూచించారు. మండలంలోని లక్ష్మీపురం, అక్కన్నఅగ్రహారం, ఆడవరం, వన్నలి తదితర గ్రామాల్లో ఈకేవైసీ నమోదు ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ–క్రాప్, ఈకేవైసీ నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ నిర్దేశిత ధరకు పంటలను విక్రయించుకునే వెసులుబాటు ఉంటుందన్నారు.

హామీలు ఫుల్.. అమలు నిల్!

- ఎన్నికల్లో రాజాంపై కూటమి నేతల హామీల వర్షం
- అధికారంలోకి వచ్చి 100 రోజులైనా చర్యలు శూన్యం
- ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పట్టించుకోని కోండ్రు మురళీమోహన్
- ప్రభుత్వం, నాయకుల తీరుపై సర్వత్రా విమర్శలు

ఎన్నికలప్పుడు ఎలాగైనా గెలవాలనే ఆశతో కూటమి నేతలు హామీల వర్షం కురిపించారు. తీరా గెలిచాక ఏ ఒక్కరూ హామీల అమలును పట్టించుకోవడం లేదు. అధికారంలోకి వచ్చి 100 రోజులైనా వారిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హామీలు ఫుల్ అని, అమలు మాత్రం నిల్ అని దుయ్యబడుతున్నారు.

రాజాం/రేగిడి/వంగర/సంతకవిటి: రాజాం పట్టణానికి ఏప్రిల్ 15వ తేదీన ఎన్నికల ప్రచారానికి వచ్చిన చంద్రబాబునాయుడుతో పాటు రాజాం కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న కోండ్రు మురళీమోహన్.. నియోజకవర్గ ప్రజలకు చాలా హామీలు ఇచ్చారు. దీంతో ఆశపడిన జనం ఓట్లు వేసి ఇక్కడి నాయకుడిని, కూటమిని గెలిపించుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత చూస్తే అప్పుడు ఇచ్చిన హామీలేవీ గుర్తు లేనట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చంద్రబాబు పాలన అంతా బూటకపు పాలననేని పలువురు అభిప్రాయపడుతున్నారు.





ఈ ఫొటోలోని టిడ్కో ఇళ్లు.. 2014–19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం నిర్మించినవే. అయితే అర్హులకు కాకుండా ఎక్కువగా ఉద్యోగులకు ఇందులో 1200 వరకు ఫ్లాట్లు కేటాయించారు. వారికి కూడా సగం బ్యాంకు రుణసాయం ద్వారా ఈ పథకాన్ని అమలు ప్రారంభించారు. అప్పట్లో ఐదేళ్లు పూర్తవుతున్నా ఇళ్లు ఇవ్వలేదు సరికదా.. బ్యాంకు రుణాలకు సంబంధించిన ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో లబ్ధిదారులు అప్పట్లోనే తమకు ఈ ఇళ్లపై ఆసక్తి లేదని వెనక్కి తగ్గిపోయారు. అనంతరం వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇక్కడ 1400 మంది నిరుపేదలకు 12 ఎకరాల్లో స్థలం కేటాయించి, ఇంటిస్థలంతో పాటు ఇళ్లను కూడా మంజూరు చేసింది. చాలామంది ఇంటిని నిర్మించుకోగా, మరికొంతమంది తమ ఇళ్లను పూర్తి చేసే పనిలో ఉన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి అప్పట్లోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల బిల్లులకు బ్రేకులు వేయడంతో పాటు కొత్త ఇళ్లు కూడా ఇంతవరకు ఇవ్వలేదు. అసలు టిడ్కో కాలనీ ప్రస్తావనే వినిపించడం లేదు.

ఈ ఫొటోలో ఉన్న వంతెన.. సంతకవిటి మండలంలోని వాల్తేరు గ్రామం వద్ద నాగావళి నదిపై నిర్మాణంలో ఉన్న బలసలరేవు వంతెన. 1998లో చంద్రబాబు ప్రభుత్వం హామీ ఇచ్చి వంతెన నిర్మించకుండా వదిలేస్తే, 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు ప్రభుత్వాన్ని వాల్తేరు పరిసర ప్రాంతాల ప్రజలు వంతెన నిర్మించాలని పలుమార్లు అభ్యర్థించారు. పోరాటాలు, దీక్షలు కూడా చేశారు. వారు రెండున్నరేళ్ల పాటు పోరాటం చేసినా వంతెన మంజూరు చేయలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత



రూ.37 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణాన్ని వేగవంతం చేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత తాము వంతెన నిర్మాణాన్ని మరింత వేగవంతం చేస్తామని చంద్రబాబు చెప్పినా ఇంతవరకు ఆ వంతెన ఎలా ఉందని కూడా తెలుసుకునే సాహసం చేయలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అంతా హడావుడే..

ఈ రోడ్డే రాజాంలో అంబేడ్కర్ జంక్షన్ నుంచి పాలకొండ వైపు ఉన్న ప్రధాన రోడ్డు. ఈ రోడ్డు గతంలో ఇరుకుగా ఉండేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే రాజాం పట్టణంలో ప్రధాన రోడ్ల విస్తరణను ముమ్మరం చేశారు. తొలివిడత, మలివిడతలో రూ.10 కోట్లు వెచ్చించి మరీ శ్రీకాకుళం రోడ్డులో రెండు కిలోమీటర్ల మేర ప్రధాన రోడ్డు విస్తరణ చేపట్టారు. 80 అడుగుల విస్తరణతో పాటు అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేశారు. అనంతరం మరో రూ.20 కోట్ల వ్యయంతో చీపురుపల్లి వైపు, పాలకొండ వైపు ఉన్న రోడ్లను విస్తరించే కార్యక్రమం చేపట్టారు. అప్పట్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులను ఒప్పించి, 80 అడుగుల మేర రోడ్డును విస్తరించారు. ఈలోగా ఎన్నికలు రావడంతో ప్రచారానికి వచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు విస్తరణ, నిర్మాణం చేస్తామని అన్నారు. ఇటీవల రూ.6 కోట్ల నిధులు వచ్చినట్లు స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కూడా ఓ ప్రకటన జారీచేశారు. అయితే రోడ్డు విస్తరణ ఇంతవరకు జరగలేదు సరికదా.. ఉన్న రోడ్డును పట్టించుకోకపోవడంతో గోతులమయమై, ప్రమాదాలు అధికమయ్యాయి. అంతా హడావుడే తప్ప పనులేమీ లేవని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ఈ ఫొటోలోని రోడ్డు.. రాజాం నుంచి సంతకవిటి వెళ్లే ప్రధాన రోడ్డు. 2009–14 మధ్య కాలంలో కోండ్రు మురళీమోహన్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మంత్రిగా ఉన్న సమయంలో ఇక్కడ డబుల్‌రోడ్డుకు నిధులు మంజూరు కావడం అనంతరం తమ వారికి ఆ టెండర్లు దక్కకపోవడంతో కోర్టులో కేసు వేసి అడ్డుకోవడం జరిగిపోయాయి. ఆ తర్వాత కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇటువంటి రోడ్లను బాగుచేస్తామని స్వయంగా చంద్రబాబుతో చెప్పించినా కార్యసాధన కనిపించడం లేదు.

రాజాం నియోజకవర్గానికి కూటమి నేతలు ఇచ్చిన హామీలు..



- రాజాం–పాలకొండ రహదారి నిర్మాణం పూర్తి చేస్తాం
- రాజాం పట్టణంలో అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తాం
- రాజాం చుట్టూ రింగురోడ్డు నిర్మిస్తాం
- అంతర్గత రోడ్లను అభివృద్ధి చేస్తాం
- మూతపడిన పరిశ్రమలను తెరిపిస్తాం
- లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందిస్తాం
- పేదలందరికీ 2 సెంట్ల స్థలమిచ్చి, ఇంటి నిర్మాణం కూడా చేస్తాం
- జగన్ ఇచ్చిన ఇళ్లను రద్దు చేయకుండా పూర్తి చేస్తాం

బాగుచేయకుంటే ప్రమాదమే..



ఉంగరాడమెట్ట నుంచి రేగిడి గ్రామం వరకు ఉన్న రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. వర్షాల సమయంలో సాయన్నగెడ్డ పొంగిన ప్రతీసారి రేగిడి గ్రామంతో పాటు ఆమదాలవలస గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. రోడ్డు మీదుగా పెద్దఎత్తున నీరు ప్రవహిస్తుండడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. చంద్రబాబునాయుడు రాజాం వచ్చినప్పుడు అంతర్గత రోడ్లు బాగుచేస్తామని అన్నారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా రోడ్లు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రోడ్లు బాగుచేయకపోతే ప్రమాదమే. – మామిడి శివప్రసాద్, రేగిడి గ్రామం, రేగిడి మండలం

ప్రజలంతా గమనిస్తున్నారు..



ప్రజలు అధికారమిచ్చారు.. చక్కగా పరిపాలన చేయకుండా ప్రజలను పక్కదోవ పట్టించే రాజకీయాలను టీడీపీ చేస్తుంటే ప్రజలు గమనిస్తున్నారు. ఎప్పుడూ గత ప్రభుత్వం, జగన్‌మోహన్‌రెడ్డిలపై అనవసరంగా బురద జల్లడమే తప్ప, ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా ఇప్పటివరకు నెరవేర్చే పరిస్థితులు కనిపించడం లేదు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలుచేయండి.. లేకపోతే ప్రజలు ఎదురుతిరిగే పరిస్థితి రాకతప్పదు.

– డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాజాం

గతంలో గోతులైనా పూడ్చారు.. ఇప్పుడు అదీ లేదు..



రాజాం–పాలకొండ ప్రధాన రోడ్డు చాలా ప్రమాదకరంగా మారింది. గతంలో అధికారులు గోతులైనా పూడ్చేవారు. ఇప్పుడు అదీ లేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రోడ్డును నిర్మించేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇంతవరకు రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలి.

పాలవలస శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ అధ్యక్షుడు, రాజాం

వంతెన నిర్మాణ ప్రస్తావన లేదు..



చంద్రబాబునాయుడు రాజాంలోని బహిరంగ సభలో బలసలరేవు వంతెన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నేటికి 100 రోజులు గడిచినా వంతెన నిర్మాణ ప్రస్తావన లేకపోవడం విచారకరం. చాలా గ్రామాల ప్రజలు వంతెన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని కోరుతున్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– ఎన్ని శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్, రామారాయపురం, సంతకవిటి మండలం

వందరోజుల పాలనపై ప్రజల పెదవి విరుపు..



బొబ్బిలి: ఇటీవల వరదలకు కొట్టుకుపోయిన బొబ్బిలి మండలంలోని పారాది కాజ్‌వే వంతెన



బొబ్బిలి: బాడంగి మండలంలోని గొల్లాది వద్ద వేగావతి నదిపై వంతెన నిర్మిస్తామన్న ప్రదేశం ఇదే..

బొబ్బిలి నియోజకవర్గానికి ఇచ్చిన హామీలు..

- గ్రోత్ సెంటర్‌లో కొత్త పరిశ్రమలు వచ్చేలా కృషి చేస్తాం
- స్థానికులకే పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు
- స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేసి, ఉద్యోగాలు ఇస్తాం
- బొబ్బిలి రాజా కాలేజ్ రోడ్డు, బజారు రోడ్డు విస్తరిస్తాం
- పారాది వంతెన నిర్మాణం, కాజ్‌వే పటిష్టతకు చర్యలు తీసుకుంటాం
- తెర్లాం, బాడంగి మండలాల రోడ్లు బాగుచేస్తాం
- రామభద్రపురం మార్కెట్ విస్తరణ చేపడతాం
- పాతరేగ, కొత్తరేగ మధ్యలో ఏడొంపుల గెడ్డపై కాజ్‌వే నిర్మిస్తాం
- కొండకెంగువ గ్రామాన్ని దత్తత తీసుకుని, అభివృద్ధి చేస్తాం
- బాడంగి మండలంలోని గొల్లాది వద్ద వేగావతి నదిపై వంతెన నిర్మిస్తా
- బొబ్బిలి మండలంలోని రాముడువలస, తెర్లాం మండలంలోని లోచర్ల ప్రాంతాల్లోని తోటపల్లి కాలువపై ఎత్తిపోతల పథకాలు ప్రారంభిస్తాం

బొబ్బిలి: కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనపై బొబ్బిలి నియోజకవర్గ ప్రజలు పెదవి విరుస్తున్నారు. హామీలు ఇచ్చి, నెలలు గడుస్తున్నా హామీలు అమలుచేసే దిశగా చంద్రబాబు సర్కారు ప్రయత్నించడం లేదన్న విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇక్కడి నుంచి కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన బేబీనాయన.. తన గెలుపు కోసం నియోజకవర్గంలోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తీరా గెలిచిన తర్వాత ఆయన ఇచ్చిన హామీల అమలు పట్టించుకోవడం లేదు. విజయవాడ వరద బాధితుల కోసం విరాళాల సేకరణలో ఉన్న శ్రద్ధ.. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో లేదని విమర్శిస్తున్నారు.

అటవీ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- డీఆర్‌వో జమ్మాన సుధీర్‌కుమార్



బొబ్బిలి రూరల్: అటవీ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌వో జమ్మాన సుధీర్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధి, ఆ సమీప ప్రాంతాల్లోని వందలాది ఎకరాల అటవీ భూములను ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఆక్రమించుకుని సాగుచేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందన్నారు. అనుమతులు లేకుండా పోడు వ్యవసాయం పేరుతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి, ఇక్కడ స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని అటవీ భూముల్లోని విలువైన వృక్ష సంపదను నాశనం చేస్తున్నారన్నారు. దీంతో కొన్ని వందలాది ఎకరాల్లోని అటవీసంపద నాశనమైందన్నారు. గతంలో ఇక్కడ వేలాది ఎకరాల్లో అటవీ సంపద ఉండగా, నేడు కనుమరుగైందని ఆవేదన వ్యక్తంచేశారు. అడవుల్లోని విలువైన చెట్లు మాయమయ్యాయని, ఇప్పుడు అటవీ శాఖ కొత్తగా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతుందన్నారు. అటవీ ప్రాంతాలపై నిరంతర నిఘా ఉంటుందని, అతిక్రమించి అక్రమాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. తన పరిధిలోని 9 మండలాల్లో మొక్కలను నాటే కార్యక్రమం చేపడుతున్నామని, ప్రస్తుతానికి షికారుగంజిలో 25 హెక్టార్లలో 25 వేల మొక్కలు నాటుతున్నామన్నారు. గోపాలరాయుడుపేట పంచాయతీలోని అటవీభూముల్లో 10 హెక్టార్లలో 12,500 మొక్కలు నాటుతున్నామన్నారు. వన సంరక్షణ సమితులు కూడా చురుగ్గానే పనిచేస్తున్నాయన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గ్రామ సందర్శన'



రామభద్రపురం: ముచ్చర్లవలసలో పింఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్న వృద్ధుడు తవిటినాయుడు



రాజాం: బొద్దాం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం/రేగిడి/బొబ్బిలి రూరల్/బాడంగి/రామభద్రపురం: మండలాల్లోని పలు గ్రామాల్లో గ్రామ సందర్శన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు, ఐసీడీఎస్ పీవోలంతా కలిసి గ్రామాల్లో పర్యటించి, అక్కడి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పశువైద్యశాలలు, సచివాలయాలు, రైతుసేవా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లను సందర్శించి, అక్కడి సిబ్బంది పనితీరు, సదుపాయాలను పరిశీలించారు. అలాగే గ్రామస్తుల నుంచి పలు సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికే గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సదరు అధికారులు తెలిపారు.

క్రీడాపోటీలు ప్రారంభం

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ రావు రవీంద్ర, హెచ్‌ఎం వి.రాజ్యలక్ష్మి, ఎంఈవోలు సీహెచ్ భాస్కరరావు, బి.శాంతికుమారి, పీడీ ఎ.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి, పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

23 నుంచి ఉచిత శిక్షణ

రాజాం: పట్టణంలోని జీఎంఆర్‌వీఎఫ్ ప్రతిభా గ్రంథాలయంలో ఈ నెల 23వ తేదీ నుంచి అర్థమెటిక్, రీజనింగ్ అంశాలపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్, రాజాం శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణను నిరుద్యోగ అభ్యర్థులు, విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9966198858, 9392595935ను సంప్రదించాలని కోరారు.

సమీక్ష సమావేశం

వంగర: గ్రామాల అభివృద్ధి పనులకు సంబంధించి, నివేదికలు మండల స్థాయికి పంపాలని ఎంపీడీవో లోపింటి త్రినాథ్ తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన అన్ని గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి, గ్రామాలకు అవసరమైన అభివృద్ధి పనులకు సంబంధించి, ప్రతిపాదనలు చేసి నివేదికలు అందజేయాలన్నారు. సమావేశంలో తహసీల్దారు డి.ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు అవలంబించాలి

రేగిడి: వరిపంట సాగులో యాజమాన్య పద్ధతులు అవలంబించాలని ఏవో జి.మురళీకృష్ణ, రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబులు సూచించారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో పొడి ఎద పద్ధతిలో సాగు చేస్తున్న వరి పంటను వారు శుక్రవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. వచ్చే ఏడాది నుంచి మరికొంతమంది రైతులు యాజమాన్య పద్ధతులు అనుసరించేందుకు ముందుకురావాలని కోరారు. యాజమాన్య పద్ధతుల ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, చీడపీడల నివారణ, కూలీల కొరత అధిగమించడం వంటివి సాధ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ తవుడుబాబు, మండల సమన్వయకర్త టి.శరత్‌బాబు, సర్పంచ్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సంతకవిటి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఎంపీడీవో రవికుమార్, తహసీల్దారు కల్యాణచక్రవర్తి అన్నారు. మండలంలోని మోదుగులపేట గ్రామంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో పలు మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ ఆహ్లాదకరమైన వాతావరణానికి తప్పనిసరిగా మొక్కలు నాటాలని కోరారు.

రేగిడి: మండలంలోని పనసలవలస గ్రామంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణాన్ని పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, సంరక్షించాలని వైష్ణవాచార్య పీఠాధిపతి తిరుమల రంగనాథం, జీఎంఆర్‌ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కేవీఎస్ ప్రసాద్ తెలిపారు. అలాగే గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, అలా అయితే గ్రామంలోని ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కో–ఆర్డినేటర్ కడగల పద్మ తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: పనసలవలసలో మొక్కలు నాటుతున్న రంగనాథం, తదితరులు

తాగునీటిని వృథా చేయొద్దు

రేగిడి: తాగునీటిని వృథా చేయవద్దని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ సూచించారు. మండలంలోని చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, ఆడవరం, గోపింపేట, లక్ష్మీపురం, దేవుదళ తదితర గ్రామాల్లో తాగునీటి కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాను ఆయన శుక్రవారం పరిశీలించారు. నీటిని పొదుపుగా వాడుకుంటే ఇతర ప్రాంతాలకు తాగునీరు సరఫరాకు వీలుంటుందన్నారు. భూగర్భ జలాల సంరక్షణకు ఖాళీ ప్రదేశాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.